## క్లుప్తంగా

### చాక్లెట్ల అలంకరణలో రాస పోలమాంబ



**తగరపువలస:** భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారు చాక్లెట్లు, జరబర పువ్వులు, గజమాల అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు అమ్మవారి 121వ అలంకరణలో భాగంగా 5 స్టార్, మంచ్, పెర్క్, డెయిరీ మిల్క్ చాక్లెట్లను వినియోగించారు. ఈ అలంకరణకు భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ యాతపేట గ్రామానికి చెందిన గంటా సూరిబాబు, వెంకటలక్ష్మి, జ్యోత్స్న, భరత్, బట్టు వర్షిత, లోహిత సహాయ సహకారాలు అందించారు. తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు భక్తులకు ప్రసాదాలు అందించారు.

### అనంతుని ఆలయానికి వాటర్ ఫిల్టర్ బహూకరణ


వాటర్ ఫిల్టర్

**పద్మనాభం:** పద్మనాభంలో గిరిపై వెలసిన అనంత పద్మనాభ స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మంచి నీరు అందించేందుకు ఓ బ్యాంకు మేనేజర్ వాటర్ ఫిల్టర్ బహూకరించారు. మద్దిలో ఉన్న సీఎస్‌బీ మేనేజర్ జయకృష్ణ తన సొంత నిధులతో ఈ ఫిల్టర్‌ను సమకూర్చారు.

### పంచముఖ ఆంజనేయునికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

**మధురవాడ:** జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయ క్షేత్ర పాలకుడు పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి పంచామృత, సుగంధ, జలాభిషేకాలు నిర్వహించారు. సిందూరం, నాగవల్లి దళాలతో అర్చన చేశారు. పుష్పాలు, తమలపాకులు, తులసి, పూలమాలలతో అలంకరణ చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు పట్నాల హరిప్రసాద్‌శర్మ, హరి స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### సింహగిరిపై ఆర్జిత సేవల పునరుద్ధరణ


నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

**సింహాచలం:** సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం నుంచి ఆర్జిత సేవలు పునరుద్ధరించారు. దీనిలో భగంగా ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

### బనారస్ రైలుకు అంకోరా స్టేషన్‌లో హాల్ట్

**తాటిచెట్లపాలెం:** విశాఖపట్నం-బనారస్-విశాఖపట్నం(18523/18524) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 11వ తేదీ నుంచి అంకోరా స్టేషన్‌లో హాల్ట్ కల్పిస్తున్నారు. విశాఖపట్నం-బనారస్(18523) ఎక్స్‌ప్రెస్ అంకోరా స్టేషన్‌కు ఉదయం 5.08 గంటలకు చేరుకుని 5.10 గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో బనారస్-విశాఖపట్నం(18524) ఎక్స్‌ప్రెస్ అంకోరా స్టేషన్‌కు సాయత్రం 6.40 గంటలకు చేరుకుని 6.42 గంటలకు బయల్దేరుతుంది.

## అన్నదాతకు మద్దతుగా..





ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి, అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహజ్వాలలు పెల్లుబికాయి. రైతుల ఆవేదనను గ్రహించి, వారికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన అన్నదాత పోరుబాటకు రైతులు తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలతో పాటు మహిళా నాయకులు ప్లకార్డులు చేతబట్టి అన్నదాతలకు అండగా నిలిచారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని, తక్షణమే సరిపడినంత యూరియా పంపిణీ చేయాలని నినదించారు.

## 3 ఎకరాలకు ఒక్క బస్తా ఇచ్చారు



మాది విజయనగరం జిల్లా ఎస్.కోట నియోజకవర్గం. నేను 3 ఎకరాలలో వరి వేస్తే ఒక్క బస్తా యూరియా ఇచ్చారు. అది ఎటూ సరిపోదని ఆనందపురం వచ్చాను. పక్క జిల్లాల వారికి ఇక్కడ ఇవ్వమని చెప్పారు. దీంతో కిలో రూ.8 చొప్పున విడిగా యూరియా కొనుగోలు చేశాను.

– వర్రి గంగినాయుడు, జామి

స్టాక్ ఫుల్ అంటున్న అధికారులు

రైతు సేవా కేంద్రాల్లో నో స్టాక్ బోర్డులు

మాటలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు కుదరని పొంతన

రైతులకు తప్పని అవస్థలు

# యూరియా.. అంతా మాయ


6 టన్నుల యూరియా ఉన్నా పంపిణీ చేయని ఆనందపురం రైతు సేవా కేంద్రం

**తగరపువలస:** రైతులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియా విషయంలో అంతా మాయగా ఉంది. యూరియా కోసం వచ్చిన రైతులకు వ్యవసాయాధికారులు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన కుదరడం లేదు. అధికారులేమో స్టాక్ ఫుల్‌గా ఉందని చెబుతుండగా.. రైతు సేవాకేంద్రాలకు వెళ్లిన రైతులకు నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఉన్న కొద్దిపాటి కేంద్రాల్లో కూడా యూరియాను అరకొరగా సరఫరా చేయడంతో, అది ఎటూ చాలక అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంటోంది.

**ఇదీ పరిస్థితి..**

భీమిలి డివిజన్‌లో ఒక్క భీమిలి మండలంలో తప్ప ఆనందపురం, పద్మనాభం మండలాలలో రైతులకు యూరియా సరిపడినంతగా అందడం లేదన్నది వాస్తవం. యూరియా కోసం పక్క జిల్లాలకు చెందిన రైతులు ప్రతిరోజూ ఆనందపురం, పద్మనాభం మండలాలలో చక్కర్లు కొడుతున్నట్టే .. ఇక్కడి రైతులు కూడా పక్క జిల్లాలకు యూరియా కోసం వలస వెళ్తున్న నిజం వ్యవసాయాధికారులకు తెలిసినా ప్రభుత్వానికి భయపడి అబద్ధాలు వల్లె వేస్తున్నారు. రెండు వారాల క్రితం వ్యవసాయాధికారులు విడుదల చేసిన ఒక ప్రకటనలో భీమిలి డివిజన్‌లో పుష్కలంగా యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. ఉడుపులు పూర్తి కానందున మే, జూన్ నెలల్లోనే 600 మెట్రిక్ టన్నుల యూరియా ఉద్యానవన పంటలకు సరఫరా చేసినట్టు చెప్పారు. వ్యవసాయాన్ని నిర్వీర్యం చేయాలన్న కూటమి ప్రభుత్వం కుట్రలో భాగంగానే వైఎస్సార్‌సీపీ నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు చాలా వరకు 15 నెలలుగా తెరచుకోలేదు. దీంతో పక్క పంచాయతీలలోని రైతు సేవా కేంద్రాలలో యూరియా ఇస్తున్నారని తెలిసి వెళ్లేసరికి నో స్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతుల ముంగిట్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందేవని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.


యూరియా స్టాక్ లేని వేములవలసలోని గణేష్ ఎంటర్ ప్రైజెస్


15 నెలలుగా తెరవక తుప్పలతో నిండిపోయిన తాళ్లవలస రైతు సేవా కేంద్రం

### చిల్లరగా కిలో రూ.8 చొప్పన విక్రయాలు

**ఈ క్రాప్ తరువాత రైతు వేసిన పంటకు అనుగుణంగా సరిపడినంత యూరియా ఇవ్వవలసి ఉండగా రైతుకు ఎంత పంట ఉన్నా పట్టించు**కోకుండా ఆధార్‌కార్డుకు ఒక బస్తా అంటూ కోటా పద్ధతిలో ఇస్తున్నారు. దీంతో వ్యవసాయం లేనివారు కూడా ఆధార్‌తో యూరియా కొనుగోలు చేసి ప్రైవేట్ దుకాణాల ద్వారా కిలో రూ.8 చొప్పున విక్రయిస్తున్నారు. వాస్తవానికి వరి నాట్లు వేసిన తరువాత ఎకరాకు అరబస్తా యూరియా వేయవలసి ఉంటుంది. ఎక్కువ ఎకరాలు ఉన్న రైతులతో పాటు లీజుకు తీసుకుని సాగు చేసే రైతులకు ఈ కోటా పద్ధతిలో యూరియా ఎటూ సరిపోవడం లేదు. ఇప్పటికే పద్మనాభం మండలంలో యూరియా దొడ్డిదారిన పక్క జిల్లాలకు తరలిపోయినట్టు గుర్తించిన వ్యవసాయాధికారులు దుకాణం యజమానికి మెమో కూడా జారీ చేసిన సంగతి తెలిసిందే.

### ఎమ్మెల్యే, అధికారుల పొంతన లేని ప్రకటనలు

భీమిలి డివిజన్‌లో ఈ ఏడాది సాధారణ విస్తీర్ణం భీమిలి మండలంలో 1560 హెక్టార్లు, ఆనందపురంలో 2750, పద్మనాభంలో 5989 హెక్టార్లుగా ఉంది. దీనికి 2400 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని ఇటీవల వ్యవసాయాధికారులు తెలిపారు. దీనికి భిన్నంగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం మాట్లాడుతూ 90శాతం యూరియా పంపిణీ చేసినట్టు చెప్పారు. మూడు మండలాలలో రైతాంగం 9,161 ఎకరాలలో వరి పంట, 25,842 ఎకరాలలో ఉద్యానవపంటలు సాగు చేస్తున్నట్టు తెలిపారు. వరికి 1237 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమన్నారు. ఇది వ్యవసాయాధికారులు తెలిపిన అంచనాలో సగమే ఉంది. అలాగే మూడు మండలాలలో 10,299 హెక్టార్లలో వరి సాగవుతున్నట్టు తెలిపారు. ఒక హెక్టారుకు 2.471 ఎకరాలు కాగా ఎమ్మెల్యే చెప్పిన అంకెలు, వ్యవసాయాధికారులు చెప్పిన అంకెలకు పొంతన కుదరడం లేదు.

## మోపాడ నుంచి వచ్చాను



మాది విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం. 2 ఎకరాలలో వరి వేశాను. సరిపడా యూరియా అక్కడ దొరక్క ఆనందపురం వచ్చాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యూరియా, ఎరువులు సరిపడా లభించేవి. ఎలాంటి చింత ఉండేది కాదు.

–తుమ్మగుంట అనంతయ్య, మోపాడ

## ప్రధాన రోడ్లు, జంక్షన్లు ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి

**జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్**

**కొమ్మాది:** త్వరలో జరగనున్న ప్రధాన సమ్మిట్లు, ఐఎఫ్‌ఆర్ కార్యక్రమాలకు విశాఖ వేదిక కానున్నందున నగరాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులకు సూచించారు. జీవీఎంసీ జోన్-2 లోని 8వ వార్డు పరిధిలో రుషికొండ, టీటీడీ దేవాలయం వరకు ఉన్న సెంటర్ మీడియన్, రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఏపీజీబీసీ (ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్) జోనల్ మేనేజర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.దామోదరరావు, ఆర్కిటెక్ట్ సత్యతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుషికొండ నుంచి ఏ1 గ్రాండ్ వరకు, టీటీడీ దేవస్థానం మొదలైన చోట్ల ఉన్న ప్రధాన రోడ్లు, ప్రధాన జంక్షన్లు పచ్చదనంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. నగరంలో సంయుక్తంగా ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసి వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రుషికొండ బీచ్‌లో టీ టైమ్ వద్ద ఉన్న వ్యర్థాలను గమనించిన ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇకపై వ్యర్థాలు ఉంటే వ్యాపార లైసెన్సు రద్దు చేసి, షాపును తొలగిస్తామని హెచ్చరించారు. కమిషనర్ పర్యటనలో ఏఎంవోహెచ్ డా. ఎస్.కిశోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.


బీచ్ రోడ్డులో అధికారులకు సూచనలు చేస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

## 19న ఉపాధ్యాయుల రణభేరి

**పద్మనాభం:** ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 19వ తేదీన విశాఖ జిల్లాలో నిర్వహించనున్న రణ భేరి.. బైక్ జాతాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆర్.అంబేద్కర్ కోరారు. మండలంలోని మద్ది, రెడ్డిపల్లి, పొట్నూరు, బి.ఆర్.తాళ్లవలస, ఆర్.వి.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను మంగళవారం ఆయన కలిసి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ ఈ జాతాకు విశాఖ జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. జాతా నిర్వహించిన తర్వాత ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 25న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఆయన వెంట యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎం.వి.వి.ఎస్. రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంజయ్ బాబు, సీనియర్ నాయకులు కోలా సన్యాసిరావు, బోని చిన్నారావు, వెంకటేష్, శ్రీను, భాస్కర్ పాల్గొన్నారు.


మద్దిలో ఉపాధ్యాయులకు బైక్ జాతా కరపత్రాలను అందిస్తున్న అంబేద్కర్

## రోడ్డుమీదే వాహనాల పార్కింగ్


ఎండాడ కూడలి వద్ద రోడ్డుమీదే పార్క్ చేసిన ద్విచక్రవాహనాలు

**కొమ్మాది:** ఎండాడ జాతీయ రహదారి ప్రధాన కూడలి వద్ద ద్విచక్ర వాహనాలను రోడ్డు మీదే పార్క్ చేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తాయి. ట్రాఫిక్ కూడా ఎక్కువే. ఇటువంటి రద్దీ రోడ్డుపై అడ్డంగా పార్కింగ్ చేయడం వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## దూది చుట్టిన బడ్స్‌తో చెవికి ప్రమాదమే ఎక్కువ

**తగరపువలస:** దూది చుట్టిన బడ్స్‌ను చెవిలో వినియోగించడం వలన మంచి కంటే ప్రమాదమే ఎక్కువగా జరుగుతుందని ఈఎన్‌టీ వైద్యుడు గోల్వె శ్రీనివాస్ తెలిపారు. ఆనందపురం మండలం పెద్దిపాలెం ఫంక్షన్ హాల్లో మండల గ్రామీణ వైద్యులకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెవిలో వ్యర్థాలను తొలగించడానికి దూది పంపించడం వలన అన్యపదార్థం ఉంటే ఇంకా లోపలికి వెళ్లి వినికిడి డ్రమ్మును పాడు చేస్తుందన్నారు. సైనసైటిస్, డస్ట్ ఎలర్జీ, తరచూ ముక్కు నుంచి నీరు కారటం, కళ్లకు ముక్కుకు మధ్యలో వాపు, కాయలు వంటి వాటిని అశ్రద్ధ చేయవద్దన్నారు. ముక్కు దిబ్బెడతో బాధపడేవారు వారం రోజులకు మించి చుక్కలు వేయకూడదని గ్రామీణ వైద్యులకు తెలిపారు. అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి వృద్ధుల వరకు సంభవించే వ్యాధులకు సంబంధించిన విషయాలు తెలియచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్‌ను ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి సన్మానించారు. సదస్సులో ఫార్మా మేనేజర్ దివాకర్‌రెడ్డి, గ్రామీణ వైద్యులు పోతిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, కనకారావు, రామకోటేశ్వరరావు, కె.ఎస్.రావు, పి.వినోద్ తదితరులు పాల్గొన్నారు.


గ్రామీణ వైద్యులకు ముక్కు, చెవి సంరక్షణ గురించి తెలియజేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

## ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా నిర్మాణాలు

**కొమ్మాది:** జీవీఎంసీ 4వ వార్డులో ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండా పోతోంది. అధికారులకు తెలిసినా, ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తుండటంతో.. కబ్జాదారులు దానిని ఆసరాగా తీసుకుంటున్నారు. దర్జాగా కబ్జా చేసి నిర్మాణాలు సాగిస్తున్నారు. దీనికి నిదర్శనం నిడిగట్టులో ఆక్రమణే..

నిడిగట్టు సర్వే నెంబరు 52లోని భూమిలో ఓ వ్యక్తి పొక్లెయిన్ పెట్టి చదును చేయించి, కాలమ్స్ వేసి నిర్మాణం చేసుకుంటున్నాడు. ఇది వారి సొంత స్థలం అనుకుంటే పొరపాటే. ఇదంతా పక్కా ప్రభుత్వ స్థలం. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా.. నిడిగట్టు సచివాలయం సమీపంలో ఇదంతా జరుగుతున్నా ఒక్క అధికారి కూడా అటుగా చూడటం లేదు. 'మా వద్ద హెచ్చరిక బోర్డులు లేవు.. మాకు సర్వేలు..' అంటూ దాటవేస్తున్నారు. అనేక బాధ్యతలు అప్పచెప్పడంతో ప్రభుత్వ స్థలాలు రక్షించలేకపోతున్నామంటూ ప్రభుత్వ అధికారులు బహిరంగంగానే చెప్పడం గమనార్హం. ఇటీవల కె.నగరపాలెం ఎస్సీకాలనీలో 314 సర్వే నెంబరులో ఓ వ్యక్తి సుమారు 400 గజాల స్థలాన్ని ఆక్రమించి చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నాడు. అది రెవెన్యూ అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదు. ఇదే కొనసాగితే భవిష్యత్తులో ఈ ప్రాంతాల్లో ప్రభుత్వ భూమి అనేది దొరకదని పలువురు అంటున్నారు. ఈ ఆక్రమణలు జరుగుతున్న ప్రదేశాలు కూడా తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు అతి సమీపంలో ఉన్నాయి. మరి అధికారుల మౌనం వెనుక ఉన్న అంతరార్థం ఏమిటో వారికే తెలియాలి.


ప్రభుత్వ స్థలంలో సాగుతున్న నిర్మాణం

## పలకలు పగలగొట్టి ఇనుము చోరీ


మధురవాడ మార్కెట్ వద్ద ఫుట్‌పాత్‌పై ఇనుము కోసం పలకను బద్దలు కొడుతున్న వ్యక్తి


శ్లాబ్‌ను పగలగొట్టగా వచ్చిన ఇనుమును ఆటోలో తరలిస్తున్న దృశ్యం

**మధురవాడ:** జీవీఎంసీ అధికారుల ఉదాసీనత కారణంగా ఫుట్‌పాత్ వేయగా, ఇతర అవసరాల కోసం ఉంచిన పలకలను కొందరు వ్యక్తులు ఇష్టానుసారం ఇనుప ఊచల కోసం తరలించేస్తున్నారు. ఇవి మధురవాడ పరిసర ప్రాంతాల్లో ఉన్న స్క్రాప్ దుకాణాలు తరలిపోతున్నాయి. ఇలా ప్రభుత్వ ధనం పరుల పాలైపోతుంది. పైగా శ్లాబులను ఊచల కోసం ఫుట్‌పాత్ శ్లాబులపై సమ్మెటతో పగలగొట్టడం వలన కింద ఉన్న ఫుట్‌పాత్ పలకలు కూడా పగిలిపోయే ప్రమాదం ఉంది. ఇలాంటివి మధురవాడ డైలీ మార్కెట్ సమీపంలో.. పట్టపగలే జరుగుతున్నా జీవీఎంసీ అధికారులకు మాత్రం కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## నేడు డయల్ యువర్ ఆర్ఎం

**దాబాగార్డెన్స్:** డయల్ యువర్ ఆర్ఎం పేరిట బుధవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు నిర్వహించనున్నట్టు ప్రాంతీయ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. కాకినాడ, రాజమండ్రి సెక్టార్స్ వారు కూడా డయల్ యువర్ ఆర్ఎం కార్యాక్రమంలో పాల్గొని సలహాలు, సందేహాలు ఇవ్వొచ్చు. ఆసక్తి గల వారు 9959225580 నెంబరుకు డయల్ చేయాలన్నారు.

## ఇందిరమ్మ కాలనీలో 300 గజాల స్థలం ఆక్రమణ


ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మించి విక్రయానికి ఉంచిన స్థలం

**తగరపువలస:** ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ కల్లివానిపాలెం సర్వే నంబర్ 237లోని ఇందిరమ్మ కాలనీలో 300 గజాల స్థలం ఆక్రమణకు గురైందని స్థానికులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. గతంలో చిట్టెమ్మ అనే మహిళకు 60 గజాల స్థలం కేటాయించగా ఇంటి నిర్మాణం చేసుకుందని, తరువాత 60 గజాల వంతున 5 స్థలాలు ఆక్రమించారన్నారు. ఇందులో 120 గజాల స్థలం విక్రయించి, మరో 120 గజాల స్థలంలో ఇల్లు నిర్మించారన్నారు. మిగిలిన 60 గజాల స్థలంలో ప్రహరీ నిర్మించి మళ్లీ విక్రయానికి ఉంచారన్నారు. ఇంత పెద్ద ఎత్తున ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.